విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, ఆదివారం 09, మార్చి 2025

## మహా ధర్నాను జయప్రదం చేయండి

**విశాలాంధ్ర - నంద్యాల అర్బన్:** రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ వర్కర్స్ సమస్యలపై ఈనెల 11వ తేదీ ఛలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి డి.శ్రీనివాసులు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓబులేసు పిలుపునిచ్చారు. సిపిఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వము మున్సిపల్ రంగంలో కాంట్రాక్టు విధానాన్ని ప్రవేశ పెట్టేందుకు ప్రయత్నిస్తున్నదని, దీనిని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించి రెగ్యులర్ చేయాలని అనేక సంవత్సరాల నుంచి పెండింగ్లో ఉన్న పీఎఫ్, ఈఎస్ఐ సమస్యలు పరిష్కరించాలన్నారు. పెరిగిన ధరలకు అనుకూలంగా కనీస వేతనం రూ.35 వేలు ఇచ్చి విధుల్లో మరణించిన కుటుంబాలకు ఎక్స్‌గ్రేసియా చెల్లించి ఉద్యోగ భద్రత కల్పించాలన్న సమస్యలపై ఈనెల 11న విజయవాడలో జరిగే ధర్నాలో మున్సిపల్ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. పట్టణ అధ్యక్షులు రంజిత్, పట్టణ కార్యదర్శి ప్రతాప్, సహాయ కార్యదర్శి శివరాం, ఉపాధక్షుడు మస్తాన్ పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలు పరిష్కరించాలి

**విశాలాంధ్ర - నందికొట్కూరు:** పట్టణ పరిధిలోని అర్హులైన నిరు పేదలకు రెండు సెంట్లు ఇళ్ల స్థలం, గృహ నిర్మాణం కోసం రూ.5 లక్షల మంజూరు చేయాలని, పట్టణంలో మిదుతూరు రోడ్డు నందు గల గ్రంథాలయంనకు నూతన భవనం నిర్మించాలని సిపిఐ పట్టణ కార్య దర్శి శ్రీనివాసులు, జిల్లా నాయకులు రఘురామ్మూర్తిలు అన్నారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గిత్త జయసూర్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని సిపిఐ నాయకులు అందించారు. మారుతి నగర్‌లో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వర్షపు నీరు నిలవకుండా డ్రైనేజీ కాలువను ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థుల సౌకర్యం కోసం ఎన్‌సిసిని ఏర్పాటు చేయాలని కోరారు.

## కార్మిక సమస్యలపై 11న చలో విజయవాడ

**విశాలాంధ్ర - డోన్ :** మున్సిపల్ కార్మిక సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 11వ తేదీన చలో విజయవాడ చేపడుతున్నట్లు నియోజకవర్గ కార్యదర్శి అబ్బాస్, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ డోన్ నాయ కులు అజయ్, సంజీవ, గౌస్, రవి, సురేష్ మున్సిపల్ కార్మికులు చలో విజయవాడకు సిద్ధం కావాలని శనివారం పిలుపునిచ్చారు. అనంతరం అబ్బాస్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మిక సమస్యలు పరి ష్కారం కోసం అనేక దఫాలుగా విజ్ఞప్తి చేసిన నిరసన తెలియజేసిన కలెక్టర్ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ఆందోళన చేసిన రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి కానీ రాష్ట్ర అధికారులు కానీ కార్మిక సంఘాలతో చర్చించకుండా సమస్యలు పరిష్కారం చేయడం లేదని ఆగ్రహించారు. మున్సిపల్ కార్మికులందరూ పోరాటం ద్వారా మన హక్కుల సాధించుకోబడతాయని, అందరూ చలో విజయవాడకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

## అనుమానంతోనే భార్య హత్య

**విశాలాంధ్ర - కొలిమిగుండ్ల:** కట్టుకున్న ఇల్లాలుపై అనుమానం పెంచుకొని భర్తే కడతేర్చాడని రమేష్ బాబు అన్నారు. ఈ నెల ఆరో తేదీన మండలంలోని బెలుం సింగవరం గ్రామంలో బిజ్జం మనోహరమ్మ హత్య కేసులో నిందితుడు భర్త చిన్న వెంకటరామిరెడ్డిని శనివారం పోలీసులు అరెస్ట్ చేసి మీడియా ఎదుట ప్రవేశపెట్టారు. సీఐ వివరాల మేరకు చెడు వ్యసనాలతో పాటు మద్యానికి బానిసైన వెంకటరామిరెడ్డి నిత్యం అనుమానంతో మనోహరమ్మను వేధించేవాడు. మనోహరమ్మ కూలి పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషించేది. ఈనెల 6న కూలి పనికి వెళ్లి వచ్చిన మనోహరమ్మను మద్యానికి డబ్బులు ఇవ్వాలని భర్త అడుగకగా, తన వద్ద లేవని చెప్పగానే రోకలి బండతో తలపై బాధడంతో తీవ్రగాలై స్పృహ కోల్పోగా కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం బనగానపల్లె ఆసుపత్రికి తరలించారు. అదే రోజు మృతి చెందింది. తండ్రి తిమ్మారెడ్డి ఫిర్యాదు మేరకు కేస్ నమోదు చేసుకుని విచారణ చేపట్టి నిందితుడిని అంకిరెడ్డిపల్లి గ్రామంలో అరెస్ట్ చేసి బనగానపల్లె కోర్టులో హాజరుపరచగా రిమాండ్ ఆదేశించినట్లు తెలిపారు.

## మహిళలకు గుర్తింపు తీసుకోవచ్చిన పార్టీ టీడీపీ

**విశాలాంధ్ర - బనగానపల్లె:** మహిళలకు గుర్తింపు తీసుకు వచ్చిన పార్టీ తెలుగుదేశం పార్టీని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సతీమణి బిసి ఇందిరా రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని యనకండ్ల గ్రామంలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరపడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిసి ఇందిరా రెడ్డి హాజరై ప్రసంగించారు. గ్రామం చేరుకోగానే నంద్యాల జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు బొబ్బల గోపాల్ రెడ్డి, టిడిపి యువ నాయకుడు బీసీ మదన్ భూపాల్ రెడ్డి, బీసీ బాల తిమ్మారెడ్డి (చిచ్చా) ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టిడిపి కార్యకర్తలు మహిళలు పాల్గొన్నారు.

## మహిళల అభ్యున్నతికి అనేక సంక్షేమ కార్యక్రమాలు

**విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల :** మహిళల అభ్యున్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి పునరుద్ఘాటించారు. శనివారం నంద్యాల పట్టణంలోని ఎల్ కెఆర్ ఫంక్షన్ హాల్ లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైన ఈ వేడుకల్లో ఎంపీ బైరెడ్డి శబరి, జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్, యూనియన్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ నరసింహారావు, అన్ని సంఘాల మహిళలు, నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ మహిళలు అభ్యున్నతి చెందాలని, స్వయం శక్తితో ఎదగాలని, సాధికారత దిశగా అడుగులు వేయాలని, సమాజాన్ని ముందుండి నడిపించాలన్న ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు చేపట్టి అమలు చేస్తున్నారన్నారు. మహిళ అంటే ఓర్పు, సహనం, శక్తి, నిబద్ధత, సామర్థ్యం, అంకితభావం, ఆత్మాభిమానం, ప్రేమ, బాధ్యత ఇవన్నీ కలగలిపిన అందమైన వ్యక్తిత్వం గల మహిళలందరికీ అంతర్జాతీయ దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ కలెక్టర్ ఉత్తేజ పరిచారు. బ్యాంకు లింకేజీ కింద 6880 మహిళా సంఘాల సభ్యులకు 74.93 కోట్ల రూపాయలను పంపిణీ చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఎంపీ బైరెడ్డి శబరి మాట్లాడుతూ స్త్రీ లేనిదే జననం, గమనం, సృష్టే లేదన్నారు. అలాంటి గొప్ప మానవత్వమున్న స్త్రీ మూర్తిని స్మరించుకుంటూ మహిళా దినోత్సవ వేడుకలు జరుపుకోవాలన్నారు. ఎక్కడైతే మహిళలు గౌరవింప బడతారో ఆయా ప్రదేశాలలో దేవతలుంటారన్న విషయాన్ని ఎంపీ వివరించారు. పిల్లలకు విలువలతో కూడిన విద్యను అందించి ఆడపిల్లలను ఆడ పులిగా పెంచాలని ఎంపీ కోరారు. మహిళలు, విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక, సాంప్రదాయ నృత్యాలు ప్రేక్షకులను అలరించాయి. ఈ వేడుకల్లో జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొని విజయవంతం చేశారు.

## కక్ష సాధింపు ఏ ప్రభుత్వంలో జరిగిందో ప్రజలకు తెలుసు

**విశాలాంధ్ర - బనగానపల్లె:** కక్ష సాధింపు చర్యలు ఏ ప్రభుత్వంలో జరిగింది ప్రజలందరికీ తెలుసునని టిడిపి యువ నాయకుడు కాట్ రెడ్డి మల్లికార్జున్ రెడ్డి అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో టిడిపి నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి యువ నాయకుడు కాట్ రెడ్డి మల్లికార్జున రెడ్డి, పట్టణ ఉప సర్పంచ్ బురానుద్దీన్ మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కక్ష సాధింపు తప్ప అభివృద్ధి జరగడం లేదని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో బనగానపల్లె పట్టణంలోని కూరగాయల మార్కెట్లో మహిళ అయిన బీసీ ఇందిరా రెడ్డిపై దాడికి ప్రయత్నించింది మీ కుమారుడు కాదాని, గత ప్రభుత్వంలో సోషల్ మీడియాలో ప్రశ్నించిన రవితేజ పై అక్రమ కేసులు బనాయించింది. బనగానపల్లె బైపాస్ రోడ్డు, జుర్రెరు ఎత్తిపోతల పథకాన్ని నిలుపుదల చేసింది మీరు కాదా అని ప్రశ్నిస్తూ, మీ ప్రభుత్వంలో కక్ష సాధింపు తప్ప అభివృద్ధి ఎక్కడ జరిగిందన్నారు. టిడిపి ప్రభుత్వం రాగానే జుర్రెరు ఎత్తిపోతల పథకానికి రూ.30 లక్షలు, అవుకు పట్టణంలోని ప్రభుత్వ హాస్పిటల్‌లో పరికరాల కోసం రూ.25 లక్షలు, ముస్లిం మైనార్టీ షాదీ ఖానా కోసం మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సొంత నిధులు వేచించడం జరిగిందన్నారు. సూపర్ సిక్స్ పథకాలను కూటమి ప్రభుత్వం తప్పకుండా అమలు వరుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కాసింబాబు వార్డు నెంబర్ కలాం, నియాజ్ పాల్గొన్నారు.

## కనీస వేతనాలు అమలు చేయడంలో విఫలం

**విశాలాంధ్ర - పాములపాడు :** అధికారంలోకి వస్తున్న పాలక ప్రభుత్వాలు మహిళా హక్కులను కాల రాస్తున్నారని కనీస వేతనం అమలు చేయడం లేదని పేరుకే మహిళల కోసం పనిచేస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్నారు తప్ప వారికి శ్రమకు తగ్గ వేతనం అమలు చేయడంలో, పనిచేసే భద్రత కల్పించడంలో పూర్తిగా విఫలం చెందారని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎం.రమేష్ బాబు విమర్శించారు. శనివారం మండల కేంద్రంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మహిళా కార్మికులతో కలిసి మహిళా దినోత్సవాన్ని కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించుకున్నారు. అనంతరం సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు దేశంలో ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో పనిచేస్తున్న కళా కార్మికుల పట్ల పాలక ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదన్నారు. ఆశా అంగన్వాడీ మధ్యాహ్నం భోజన పథకంలో పని చేస్తున్న కార్మికులకు వేతనాలు పెంచడంలో పూర్తిగా విఫలం చెందారని, మహిళా కార్మికుల శ్రమను దోచుకుని ప్రభుత్వం నడుస్తుందని వారు విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు నెలకు రూ.3 వేలా అని, ఇది న్యాయమా అని మహిళా సంక్షేమమంటే ఇదేనా అని పాలకులను ప్రశ్నించారు. పని చేసే ప్రాంతంలో మహిళలకు భద్రత కరువైందని మహిళల పట్ల అత్యాచారాలు దాడులు అధికమయ్యాయని, వాటిని ప్రభుత్వాలు ఆరికట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు జయమ్మ, వెంకటేశ్వర్లు, రవణమ్మ, సువర్ణమ్మ పాల్గొన్నారు.

## వక్ఫ్ సవరణ బిల్లుకి వ్యతిరేకంగా ఓటు వేయండి

**విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల :** వక్ఫ్ సవరణ బిల్లుకి వ్యతిరేకంగా ఓటు వేయండని నంద్యాల ఎంపీ డా.బైరెడ్డి శబరికి నంద్యాల ముస్లిం జేఏసీ నాయకులు వినతిపత్రం అందజేశారు. నంద్యాల ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ మౌలానా అబ్దుల్లా రషాది, గౌరవాధ్యక్షులు ఎస్ఎండి అబులైస్, అబ్దుల్ సమద్ ఆధ్వర్యంలో కన్వీనర్లు సద్దాం హుస్సేన్, ట్రెజరర్ ఎస్పీ బాష, మీడియా సెక్రటరీలు జాకీర్, ఉస్మాన్ బాషా, ఇన్సాఫ్ కమిటీ రాష్ట్ర నాయకులు బాబాఫక్రుద్దీన్, ఎస్డీపీఐ నాయకులు ఏజాజ్, మౌలానా రహమతుల్లా, ముఫ్తీ ఖదీర్, ఆల్ మేవా ఖాసిం, ఎంఐఎం అక్బర్, జమాతె ఇస్లామీ అబ్దుల్ అలీం, ఎగ్జిక్యూటివ్ బాడీ మెంబర్లు స్థానిక ఎల్ కేఆర్ ఫంక్షన్ హాల్ వద్ద నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరిని కలిసి మార్చ్ 10న పార్లమెంట్ లో ప్రవేశపెట్ట బోయే వక్ఫ్ (సవరణ) బిల్లు 2024కు వ్యతిరేకంగా ఓటువేయాలని కోరుతూ వినతిపత్రాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సమాజ హితాన్ని, న్యాయాన్ని కాపాడే ఎంపీగా నిబద్ధతను తాము ఎల్లప్పుడూ అభినందిస్తున్నామని, ప్రస్తుతం పార్లమెంటులో మార్చి 10న ప్రవేశ పెట్టబోయే వక్ఫ్ (సవరణ) బిల్లు, 2024 పై తాము తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నామని, ఈ బిల్లు ముస్లిం సమాజం, వక్ఫ్ ఆస్తుల పరిపాలనపై ప్రతికూల ప్రభావాన్ని చూపేలా వుందని ఆందోళన వ్యక్తం చేశారు. వక్ఫ్ బోర్డుల్లో ముస్లింలేతర సభ్యులను చేర్చడం,జిల్లా కలెక్టర్లకు అధికారం కట్టబెట్టడం తదితర వాటిపై ఎంపీకి వివరించారు. కావున వక్ఫ్ (సవరణ) బిల్లు 2024కి వ్యతిరేకంగా ఎంపీ తన ఓటు వేయాలని, వక్ఫ్ నిబంధనల్లో ఏవైనా మార్పులు చేయాల్సి వస్తే, ముస్లిం సమాజంతో చర్చించి, వారి అంగీకారంతోనే చేయాలని, ఎంపీ స్వయంగా సమర్థించాలని కోరారు. ఎంపీ శబరి సానుకూలంగా స్పందిస్తూ తమ పూర్తి మద్దతు ఇస్తామని, కేవలం తమ పార్టీ అడ్డుకోవడం వల్లనే నేడు ఈ బిల్లు జెపిసికి వెళ్లిందన్నారు. తప్పక పార్లమెంట్‌లో బిల్లును వ్యతిరేకిస్తామని హామీ ఇచ్చారు. ముస్లిం జేఏసీ ఎగ్జిక్యూటివ్ బాడీ సభ్యులు బిల్డర్ అబ్దుల్లా, కోహినూర్ మహబూబ్ బాషా, మునీర్ అహ్మద్, సర్దార్, ఫరూక్, ఎస్డిపిఐ కలాం, కరిముల్లా, రసూల్, ఫయాజ్, జకివుల్లా, మార్కెట్ హర్షద్, ఉస్మాన్, మహబూబ్ బాషా, సౌదాగర్ సయ్యద్ అసదుల్లా పాల్గొన్నారు.

## దేవస్థానం అభివృద్ధికి మీరు చేసింది ఏమిటి

**విశాలాంధ్ర - ఆళ్లగడ్డ:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలం ప్రతిష్టతకు భంగం కలిగించే చర్యలను ఉపేక్షించమని మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి హెచ్చరించారు. శనివారం అహోబిలం బ్రహ్మోత్సవాల కార్యక్రమాలను పరిశీలించేందుకు వెళ్లిన వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే గంగుల నాని మాట్లాడుతూ గత వారం రోజుల క్రితం స్థానిక శాసనసభ్యురాలు అహోబిలానికి వచ్చి వైసిపి ప్రభుత్వం హయాంలో అహోబిలంలో దోచుకోవడం జరిగిందని అభివృద్ధి చేసింది తన హయంలోనే అని గొప్పలు చెప్పుకున్నారన్నారు. గతంలో మీరు మంత్రిగా ఉండి అహోబిలానికి రోడ్డు కూడా వేయించకుపోయారని ఎద్దేవా చేశారు. 2019లో వైసీపీ అధికారంలో తాను ఎమ్మెల్యే అయ్యాక అహోబిల క్షేత్రంలో రోడ్లు వేయడం జరిగిందన్నారు. అహోబిలం మఠంకు స్వయం ప్రతిపత్తిని సుప్రీం కోర్టు కల్పించిందని, కానీ అహోబిలం మఠంలో ఏదేని కారణం చేత మఠం ఉద్యోగి సస్పెండ్ అయితే వారిపై చర్యలు తీసుకొని తిరిగి ఉద్యోగం కల్పించే హక్కు మఠం కు ఉందని కానీ ఇప్పుడు ఉద్యోగం ఇవ్వాలంటే మీ అనుమతి కావాలని మఠం వారు అంటున్నారన్నది నిజం కాదా అన్నారు. మీరు చేసే ప్రతి పని రికార్డు అవుతుందన్నారు. కూటమి ప్రభుత్వం 8 నెలల్లో ఏం చేసిందో మా నేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి వివరించారన్నారు. మా హయాంలో ఆళ్లగడ్డలో గంగ జాతర జరిపించామని, మీ హయాంలో అహోబిలం పారువేట ఉత్సవ పల్లకి ఆళ్లగడ్డలో ఎక్కడికి వెళ్లాలో మీరే డిసైడ్ చేస్తున్నారని, రాజకీయాలు చేస్తోంది మీరేనని విమర్శించారు. మీరు చేసే అరాచకాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. తాలూకా వైసీపీ నాయకులు భూమా కిషోర్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక దేవాలయాల్లో అరాచకాలు ఎక్కువయ్యా యన్నారు. అహోబిల క్షేత్రంలో లడ్డు నుండి తలనీలాల వరకు మీరే దోచుకుంటున్నారన్నా రని ఆరోపించారు. సనాతన ధర్మాన్ని కాపాడుతున్న పవన్ కళ్యాణ్ కు అహోబిలంలో జరిగే అవినీతి కనబడదా అని ప్రశ్నించారు. దేవాలయాల్లో రాజకీయం తగదని భూమా కిషోర్ రెడ్డి అన్నారు. ఈ సమావేశంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గంధం రాఘవరెడ్డి, కౌన్సిలర్ గొట్లూరు సుధాకర్ రెడ్డి, నాసారి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## శాంతిరాం ఫార్మసీ కళాశాలలో అంతర్జాతీయ సదస్సు

**విశాలాంధ్ర-పాణ్యం:** శాంతిరాం ఫార్మసీ కళాశాలలో ఇండో- కరేబియన్ అంతర్జాతీయ సదస్సును ఔషధ రూపకల్పన, అభివృద్ధి, విశ్లేషణ, రోగి సంరక్షణలో ఆవిష్కరణలు అనే అంశముపై అసోసియేషన్ ఆఫ్ ఫార్మసీ ప్రొఫెషనల్స్, శాంతిరాం ఫార్మసీ కళాశాల నంద్యాల వారు సంయుక్తంగా నిర్వహించడం జరిగినది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆర్‌జిఎం, శాంతిరాం విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ శాంతి రాముడు మాట్లాడుతూ ఔషధ రంగంలో ప్రస్తుతం ఉన్నటువంటి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉపయోగించి మరిన్ని ఆవిష్కరణలు చేయాలి అని తెలిపారు. ఈ అంతర్జాతీయ సదస్సులో ప్రొఫెసర్ రాజు దహియా అసోసియేషన్ ఆఫ్ ఫార్మసీ ప్రొఫె షనల్స్ ప్రెసిడెంట్ మాట్లాడుతూ ఈ ఇండో కరేబియన్ సదస్సు ముఖ్య ఉద్దేశం వివరించారు. ఔషధాలను అభివృద్ధిపరిచి రోగి సంరక్షణ కొరకు మరిన్ని ఆవిష్కరణ చేయవలసిందిగా కోరారు. ఈ సదస్సులో ఆర్జేయం విద్యాసంస్థల డీన్ డాక్టర్ అశోక్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు అందరూ ఈ సదస్సులో పాల్గొని తమ యొక్క పరిశోధన అంశంలో ఓరల్ ప్రజెంటేషన్, ఈ పోస్టర్ ద్వారా తమ ఆవిష్కరణ ప్రదర్శించడం ద్వారా వారి యొక్క పరిశోధన సామర్థ్యాన్ని పెంపొందించు కోవాలని కోరారు. ఈ అంతర్జాతీయ సదస్సులో పాల్గొనడానికి దేశంలోని వివిధ రాష్ట్రాలలోని 28 ఫార్మసీ కళాశాల నుంచి సుమారు వెయ్యి మందిపైగా విద్యార్థులు పాల్గొన్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మధు సూదన శెట్టి తెలిపారు. డాక్టర్ గౌరవ్ గుప్తా ప్రొఫెసర్ అజ్మాన్ యూనివర్సిటీ, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ మందుల తయారీలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రాముఖ్యత గురించి పరిశోధన అంశాన్ని విద్యార్థులకు వివరించారు. ప్రొఫెసర్‌కి మురళీధరరావు ప్రిన్సిపల్, సెయింట్ మేరీస్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ సికింద్రాబాద్, క్లినికల్ ట్రయల్స్ వెనుక ఉన్న సైన్సు దశలు, నీతి, మానవ భద్రత అనే అంశంపై పరిశోధన అంశాన్ని విద్యార్థులకు వివరించారు.

## వైభవంగా స్వర్ణ రథోత్సవం

**విశాలాంధ్ర - శ్రీశైలం :** శ్రీశైలం మహా క్షేత్రంలో ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించబడ్డాయి. స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకము, అన్నాభిషేకం, అర్చక స్వాములు సంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను స్వర్ణ రథంపై వేంచింపజేసి స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి శ్రీశైల పురవీధుల్లో స్వర్ణరథోత్సవం గంగాధర మండపం నుండి నందిమండపం కళాకారుల విన్యాసాల నడుమ స్వర్ణ రథ ఊరేగింపు ఎంతో వైభవంగా ఆలయ అధికారులు నిర్వహించారు. ఈ విశేష కార్యక్రమంలో కార్యనిర్వహణ అధికారి ఎం.శ్రీనివాసరావు దంపతులు ఆలయ అర్చక వేదపండితులు, ఆలయ అధికారులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## ఎస్టీ కులంలో ఇతర కులాలను చేర్చొద్దు

**విశాలాంధ్ర - బనగానపల్లె:** ఎస్టి కులంలో ఇతర కులాలను చేర్చే రాదని జిల్లా గిరిజన సమైక్య అధ్యక్షుడు కాలింగీరి రాముడు కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కాలింగిరి రాముడు మాట్లాడుతూ గిరిజనుల కులంలో 32 జాతుల కులం వారు ఉన్నారని వారి భాషలు, వారి కట్టు విధానాలు ఇప్పటికీ మారలేదన్నారు. అడవి ప్రాంతంలో నివసించే గిరిజను చాలా దీనావస్థిలో కాలం గడుపుతున్నారని, రాష్ట్ర కేంద్ర ప్రభుత్వములు గిరిజన ప్రాంతాలకు రహదారులు, కరెంటు సౌకర్యాలు కల్పించలేదని, ఆర్థికంగా వీళ్లను మెరుగుపరిచే పథకాలు తీసుకురావాలన్నారు.

## అన్ని రంగాల్లో దూసుకుపోతున్న మహిళలు

**విశాలాంధ్ర - నందికొట్కూరు:** ఆకాశమే హద్దుగా అన్ని రంగాలలో శరవేగంగా దూసుకుపోతున్న మహిళలకు ఏపీ మహిళా సంఘం జిల్లా కార్యదర్శి రజిత, నర్సు బాయ్‌లు శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. శనివారం పట్టణంలోని జై కిసాన్ పార్క్ నందు శ్రామిక మహిళా ఫోరం ఏఐటియుసి నందికొట్కూరు పట్టణ సమితి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు జరుపుకోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రఘురాంమూర్తి హాజరై మాట్లాడుతూ సృష్టికి మూలమైన స్త్రీని ఒకప్పుడు వంటింటి కుందేలుగా చూశారనీ, ఇప్పుడు ఆమె అంతరిక్షపు అంచులను తాకి వస్తోందన్నారు. పురుషుడే బలవంతుడని, స్త్రీ బలహీనురాలని భావించే రోజులు పోయాయన్నారు. పురుషులతో సమానంగా మహిళలు కూడా ముందడుగు వేస్తున్నారనీ,విజయాలు సాధిస్తూ ఉన్నత శిఖరాలకు చేరుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో శ్రామిక మహిళా ఫోరం నాయకులు దానమ్మ, సుశీలమ్మ, పల్లవి, యశోద, హనీఫ బీ, ఫరీదాబీ, గీత, ముత్యాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

## లోక్ అదాలతలతో 402 కేసులు పరిష్కారం

**విశాలాంధ్ర- కోవెలకుంట్ల:** పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఆవరణంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలతో కేసులో402 కేసులు పరిష్కారం అయినట్లు షేక్ అబ్దుల్ రెహమాన్ పేర్కొన్నారు. ఆయన తెలిపిన వివరాల మేరకు శనివారం కోర్టు పరిధిలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కోవెలకుంట్ల కోర్టు జూనియర్ సివిల్ జడ్జి షేక్ అబ్దుల్ రెహమాన్, ఏపీపీ వసంత లక్ష్మి, కోవెలకుంట్ల సీఐ హనుమంతు నాయక్, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు డి.శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు వి.తిరుపాలు, ప్రధాన కార్యదర్శి ఎం.ఓబులేసు, కోశాధికారి సి.నాగ శేషు, న్యాయవాదులు వివిస్ కృష్ణమూర్తి, జి.సి.తిరుపతయ్య, జి.ఎల్.నరసింహుడు, ఎస్.ఖాశీం సాహెబ్, ఎం.చంద్రుడు, కె.రమేష్, బి.ఇంద్ర కుమార్ పాల్గొన్నారు.

## పోలీసుల ఆధ్వర్యంలో ర్యాలీ

**విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల :** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్, జిల్లా ఇంచార్జి ఎస్పి విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు నంద్యాల సబ్ డివిజన్ అడిషనల్ ఎస్పీ మంద జావళి ఆల్ఫోన్స్ ఆధ్వర్యంలో జిల్లా మహిళా పోలీస్ అధికారులు, సిబ్బంది సహకారంతో మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ నంద్యాల పట్టణ కేంద్రంలోని రాజారెడ్డి కళ్యాణ మండపం నుండి వై జంక్షన్ మున్సిపల్ ఆఫీస్ వరకు ర్యాలీ నిర్వహిస్తూ మున్సిపల్ ఆఫీస్ వద్ద మానవహారంగా ఏర్పడి భేటీ బచావో భేటీ పడావో, స్త్రీలను గౌరవిద్దాం, సమాజాభ్యున్నతికి తోడ్పడుతామంటూ నినాదాలు చేస్తూ తిరిగి రాజారెడ్డి కళ్యాణ మండపం వరకు ర్యాలీ సాగింది. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ మంద జావళితో పాటు మహిళ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్లు జయరాములు, రమేష్ కుమార్, త్రీ టౌన్ సిఐ కంబగిరి రాముడు, ట్రాఫిక్ సిఐ మల్లికార్జున గుప్తా, సబ్ ఇన్స్పెక్టర్ కుమారి, జిల్లాలోని మహిళా పోలీసులు, గ్రామ, వార్డు మహిళ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఆళ్లగడ్డలో మహిళా దినోత్సవ వేడుకలు

**విశాలాంధ్ర - ఆళ్లగడ్డ :** పట్టణంలోని మహాలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు డిఎస్‌పి ప్రమోద్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. మహిళా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీలు, చిత్రలేఖన పోటీలలో విజేతలైన విద్యార్థులకు డిఎస్పి ప్రమోద్ కుమార్ బహుమతులు అందజేశారు. పోలీస్ మహిళా ఉద్యోగులకు సర్టిఫికెట్లు బహుమతి ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో సైకాలజిస్ట్ తిరుపతి, ఐఐటి నీరజ, టౌన్ ఎస్ఐ షేక్ నగీనా, అపుస్మ ఆళ్లగడ్డ నియోజకవర్గం అధ్యక్షులు టి.అమీర్ బాష, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ పిరదోస్ అంజుమ్, వైస్ ప్రిన్సిపాల్ శారా మేరీ విజయ్ కుమారి, వృక్షయజ్ఞం సేవ కమిటీ అధ్యక్షురాలు లావణ్య, మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

## పాడితో ప్రగతి

గేదెల పాలతో కుటుంబ పోషణ
మహిళలకు స్ఫూర్తిగా సురేఖ, మాబుచాన్

**విశాలాంధ్ర - చాగలమర్రి:** పాడిపరిశ్రమతో లాభాలు సాధిస్తున్నారు. ఎవరిపైనా ఆధారపడకుండా కుటుంబాన్ని పోషించుకుంటు న్నారు. చాగలమర్రికి చెందిన సురేఖ రెండు గేదెలతో పాడిని ప్రారంభించి పాడి వైపు దృష్టి సారించింది. పదేళ్ల క్రితం రెండు గేదెలను కొనుగోలు చేసి అర ఎకరా స్థలాన్ని ఏడాదికి రూ.36 వేల అద్దెతో లీజుకు తీసుకున్నారు. ఇందులో గేదెలకు రేకుల షెడ్డు ఏర్పాటు చేశారు. పాల ఉత్పత్తిలో మంచి లాభాలు రావడంతో మరింత విస్తృత పరిచారు. ప్రస్తుతం 25. గేదెలను పోషిస్తున్నారు. 13 గేదెలు, 12 దూడలు ఉన్నాయి. రోజుకు 72 లీటర్ల పాల ఉత్పత్తి జరుగుతోంది. పశు పోషణ కోసం రూ.70 వేలు ఖర్చు చేస్తున్నారు. ఖర్చులు పోగా రూ.30 వేలు దాకా ఆదాయం వస్తోంది. గత ఐదేళ్లలో దాన, గడ్డి విత్తనాలు అందలేదు. వచ్చిన డబ్బుల తోనే పాడి పరిశ్రమకు వెచ్చిస్తూ ముందుకు సాగుతున్నారు. పొదుపు సంఘం సభ్యురాలిగా ఇతరులకు స్ఫూర్తినిస్తున్నారు. చాగలమర్రి గ్రామానికి చెందిన మాబుచాన్ పాడిపరిశ్రమలో మహిళలకు ఆదర్శంగా నిలిచారు. పదేళ్ల క్రితం అనారోగ్యంతో భర్త చనిపోయాడు. మాబుచాను ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. భర్త లేకున్నా ఆత్మస్థైర్యంతో వ్యవసాయం చేసేందుకు పొలాలను కౌలుకు తీసుకుంది. పంటలు సరిగా పండక నష్టపోవాల్సి వచ్చింది. ఆర్థిక ఇబ్బందులు అధికమయ్యాయి. పిల్లల పోషణ భారంగా మారింది. ఈ క్రమంలోనే సౌదికి వెళ్లి ఐదేళ్లపాటు అక్కడ పని చేసుకుంటూ జీవనం సాగించింది. ఆర్థికంగా కొంత మేర నిలదొక్కుకుంది. తిరిగి స్వగ్రామం చాగలమర్రికి చేరుకుంది. ఏడేళ్ల క్రితం రెండు గేదెలను కొనుగోలు చేసే పాడిపరిశ్రమ మొదలు పెట్టింది. ప్రస్తుతం ఎనిమిది గేదెలు, 12 దూడలతో పశుపోషణ చేస్తోంది. ఆర్థికంగా పుంజుకొని కూతురు వివాహం చేసింది. పాడి గేదెల నిర్వహణకు నెలకు రూ.8 వేలు దాకా ఖర్చు చేస్తోంది. ఖర్చులు పోగా నెలకు రూ.25 వేల దాకా ఆదాయం వస్తోందని ఆమె చెబుతోంది.

## దొంగలు బాబోయ్ దొంగలు

**విశాలాంధ్ర - రుద్రవరం:** మండలంలోని పలు దేవాలయాలలో ఇటీవల వరసగా దేవాలయా లలోని హుండీలు చోరీకి గురవుతున్నాయి. గత నెల రోజుల క్రితం మండలంలోని కోటకొండ గ్రామంలో ఉన్న మారెమ్మ గుడిలో, ఆర్ నాగలవరం గ్రామంలోని నాగేశ్వరి ఆలయంలో, నరసాపురం గ్రామంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో హుండీలు చోరీకి గురయ్యాయి. ఈ సంఘటనలు మరవకముందే మండల కేంద్రంలోని భాస్కర నందీశ్వర ఆలయంలో ఉన్న బ్రహ్మంగారి గుడి, సాయి గుడిలో ఉన్న కాశిరెడ్డి నాయన గుడిలో శనివారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు గుడిలోకి ప్రవేశించి తలుపులకు ఉన్న తాళాలను పగలగొట్టి గుడిలో ఉన్న హుండీలను దొంగతనంగా తీసుకొని వెళ్లినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. బ్రహ్మంగారి గుడిలో ఉన్న హుండీని పగలగొట్టి అందులో ఉన్న నగదును, సాయి గుడిలో ఉన్న కాశిరెడ్డి నాయన గుడిలో ఉన్న హుండీనీ తీసుకొని వెళ్ళినట్లు నిర్వాహకులు తెలిపారు.

విశాలాంధ్ర కర్నూలు
www.visalaandhra.com
కర్నూలు, ఆదివారం 09, మార్చి 2025



# ఏపీ మహిళా సమాఖ్య సమితి ఆధ్వర్యంలో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

**విశాలాంధ్ర బ్యూరో – కర్నూలు :** అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని ఏపీ మహిళా సమాఖ్య జిల్లా సమితి ఆధ్వర్యంలో కలెక్టరేట్ నుండి సీఆర్ భవన్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో అగ్రబాగాన ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.దుర్గా భవాని, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గిడ్డమ్మ, శ్రావణిరెడ్డి, నగర కార్యదర్శి భారతి నిలిచారు. ప్రజానాట్యమండలి డప్పు చప్పుళ్ళతో భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం సీఆర్ భవన్ వద్ద ఏపీ మహిళా సమాఖ్య పతాకాన్ని దుర్గాభవాని ఆవిష్కరించారు. ప్రజానాట్యమండలి కళాకారుల గేయాలు కళాకారులు కోలాటాలు అందరిని ఆకట్టుకున్నాయి. మహిళలు కేక్ కట్ చేసి, శుభాకాంక్షలు తెలిపారు. మాజీ కార్పొరేట్, జిల్లా అధ్యక్షురాలు గిడ్డమ్మ, దుర్గాభవానిని, సమతా నాయకురాలు సుజాతలను శాలువలు కప్పి సన్మాణించారు. ఈ కార్యక్రమంలో నాగేంద్రమ్మ, సుదాదేవి, పావని, జయలక్ష్మీ, సులోచనమ్మ, వెంకటేశ్వరమ్మ, ఆశాబేగం, సోఫియా, రభియా, దేవీబాయి, మున్ని, ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి నాగరాజు, దప్పు మాణిక్యం, బద్రి, శ్రీను, శివ, సీపీఐ నగరకార్యవర్గ సభ్యులు బీసన్న, శ్రీని వాసరావు, మహేష్, తదితరులు ఉన్నారు.

# మహిళలు బాధ్యత తీసుకోవాలి : జిల్లా కలెక్టర్

**విశాలాంధ్ర బ్యూరో–కర్నూలు:** కుటుంబంలో, సమాజం లో మహిళ పాత్ర విశిష్టం అని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అన్నారు. శనివారం నగరం లోని ఎమ్ఆర్సీ కన్వెన్షన్ హాల్ లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ప్రపంచ వ్యాప్తంగా పండుగలా జరుపు కోవడం సాధించడమే మహిళలు సాధించిన గొప్ప గెలుపుగా అభివర్ణించారు. మహిళల పట్ల లింగ వివక్ష, ఓటు హక్కు, చదువుకునే అవకాశంలేని పరిస్థితులను అధిగమించి నేడు ఈ స్థానానికి ఎదగడం అంటే ఇదంతా మహిళలు ప్రపంచ వ్యాప్తంగా చేసిన పోరాట మేనని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో, జిల్లాలో పొదుపు ఉద్యమం వల్ల మహిళల్లో చైతన్యం వెల్లు విరిసిందని కలెక్టర్ తాన్నారు. నేడు పొదుపు సంఘాల వద్ద ఉన్న డిపాజిట్లు కలిపితే ఒక బ్యాంక్ సరిపోదని కలెక్టర్ ప్రశంసించారు. జిల్లాలో పొదుపు ఉద్యమాన్ని చారిత్రక అంశంగా అభివర్ణిస్తూ, జిల్లాలో పొదుపు మహిళలు అద్భుత విజయాలు సాధిం చారని, వారు సాధించిన విజయాలు అందరికీ స్ఫూర్తిదా యకంగా నిలిచాయని కలెక్టర్అన్నారు. సమాజంలోనే కాదు, కుటుంబంలోను మహిళ పాత్ర చాలా విశిష్ట మైనదని కలెక్టర్ తెలిపారు.పిల్లల్ని పెంచడం, విద్యా బుద్దులు నేర్పించడం, వారిని ప్రయోజకులుగా చేయ డంలో తండ్రి బాధ్యత కంటే తల్లి బాధ్యత ఎక్కువని కలెక్టర్ ప్రశంసించారు. జిల్లాలో బాల్య వివాహాలను అరికట్టే బాధ్యతలో మహిళలు

తగిన సహకారం అందించాలని కలెక్టర్ కోరారు. జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో బాల్య వివాహాలు ఎక్కువగా జరుగుతు న్నాయని, వీటి వల్ల ఎన్నో అనార్థాలు కలుగుతాయని కలెక్టర్ తెలుపుతూ, గ్రామాలలో ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లయితే వెంటనే ఐసిడిఎస్ పిడికి సమాచారం ఇచ్చే విధంగా బాధ్యత తీసుకోవాలని కలెక్టర్ మహిళలకు తెలిపారు. ఎంఎస్ఎం ఈల కింద మహిళలకు ఈరోజు దాదాపు రూ. 13.27 కోట్ల రుణాలు, ర్యాపిడో ప్రోగ్రాం కింద ఎలక్ట్రికల్ స్కూటీలను 25 మంది సభ్యులకు ఇవ్వడం జరిగిందన్నారు. ఎంపీ బస్తిపాడు నాగరాజు, ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి, డిప్యూటీ మేయర్ రేణుకా శిద్దారెడ్డి, వాల్మీకి సంఘం చైర్మన్ బొజ్జమ్మ, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ సంజమ్మ, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, డిఆర్వో సి.వెంకటనారాయణమ్మ, ఐసిడిఎస్ పిడి నిర్మల, మెప్మా పీడీ శివ నాగ లీల, డిఆర్డిఏ పిడి రమణా రెడ్డి, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి అరుణ మహిళల గొప్పతనం గురించి కొనియాడారు.

## జనరిక్ మందులపై అవగాహన కల్పించాలి

**విశాలాంధ్ర – కర్నూలు సీటీ:** జనరిక్ మందులపై అందరికీ అవగాహన కలిపించాల్సిన అవసరం ఎంతైనా ఉందని కర్నూలు ఎంపి బస్తిపాటి నాగరాజు అన్నారు. నగరంలోని ప్రభుత్వాసుపత్రి ఎదురుగా ఉన్న జన ఔషది కేంద్రంలో నిర్వహించిన జన ఔషది దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జన ఔషది కేంద్రంలోని జనరిక్ మందులను పరిశీలించిన ఎం.పి జనరిక్ మందులను కొనుగోలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్లమెంటులో తనకు మొదటి సారి మాట్లాడే అవకాశం ఆరోగ్యంపై వచ్చిందని, అందులో భాగంగా జనరిక్ మందుల పైనే మాట్లాడానన్నారు. జనరిక్ మందుల పై ప్రజలు అపోహలు చెందాల్సిన అవసరం లేదని.. బ్రాండెడ్ మందుల లాగానే ఈ మందులు పని చేస్తాయాన్నారు. బ్రాండెడ్ మందులతో పోల్చుకుంటే జనరిక్ మందులు అతి తక్కువ ధరలకే లభిస్తాయాన్నారు. ఇక పట్టణాలలోనే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో సైతం జనరిక్ మందుల పై అవగాహన కలిపించేలా కృషి చేయాలని అధికారులకు ఎంపి నాగరాజు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభు త్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు, జిలా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శశికళ, జిల్లా ఔషధాల శాఖ ఏడి రమాదేవి, డ్రగ్ ఇన్స్పెక్టర్లు హరిహర తేజ, పర్వీన్ సుల్తానాలు పాల్గొన్నారు.

## గడ్డివాము దగ్ధం

**విశాలాంధ్ర – పెద్దకడబూరు :** మండల పరిధిలోని దొడ్డిమేకల గ్రామంలో ఎంపీటీసీ మల్లేష్ గడ్డివాముకు శనివారం ప్రమాదవశాత్తు నిప్పంటుకొని అగ్ని ప్రమాదం సంభవించింది. మంటల్లో గడ్డివాము దగ్ధం కావడంతో లక్ష రూపాయల ఆస్తి నష్టం జరిగింది. ఎంపీటీసీ మల్లేష్ 5 ఎకరముల వరి గడ్డిని కొనుగోలు చేసి గడ్డివాము వేసుకున్నారు. మధ్యాహ్నం ప్రమాదవశాత్తు నిప్పు రవ్వలు ఎగిరి మల్లేష్ గడ్డివాముపై పడడంతో అగ్నిప్రమాదం సంభవించింది. చుట్టు పక్కల వారు అప్రమత్తమై మంటలు ఆర్పేలోగా గడ్డివాము దగ్ధమయింది. పశువుల కోసం కొనుగోలు చేసి ఏర్పాటు చేసుకొన్న గడ్డివాము కళ్ల ముందే కాలిపోవడంతో ఎంపీటీసీ బాధ వ్యక్తం చేశారు.

## ఉన్నత స్థాయికి ఎదగాలి: డీఈవో

**విశాలాంధ్ర – కర్నూలు ఎడ్యుకేషన్:** నగరంలోని సెయింట్ క్లారిట్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్లో వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపల్ హృదయ స్వామి అధ్యక్షతన జరిగింది దీనికి ముఖ్యఅతిథిగా జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.సామెల్ పాల్ హాజరై మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగడానికి ఈ స్కూలు ఎంతో తోడ్పడుతుందన్నారు. కార్పొరేటర్ కళాశాలకు దీటుగా సెంట్ క్లారిట్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ ఇక్కడ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఫాదర్స్ ఎంతో ప్రార్ధన వల్ల ఈ స్థలం స్కూలు నిర్మించడం జరిగిందన్నారు. ఇలాంటి స్కూళ్లకు తల్లిదండ్రులు ప్రోత్సహించి ఉపాధ్యాయులకు తోడునివ్వాలని అప్పుడే విద్యార్థి బంగారు భవిష్యత్తుగా తీర్చి దిద్దుతారన్నారు. ఎంఈఓ శ్రీనివాసులు, ఫాదర్స్, పాఠశాల సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## నేటి నుంచి గోఖారమయ్య దర్గా ఉరసు

**విశాలాంధ్ర –సి బెళగల్:** నేటి నుంచి మండల పరిధిలోని బురాన్ దొడ్డి గ్రామంలో గోఖారమయ్య తాత దర్గా ఉరుసు మహెూత్సవాలు జరగనున్నట్లు దర్గా నిర్వాహక పెద్దలు, గ్రామస్తులు తెలిపారు. ఆదివారం తెల్లవారు జామున కడియాల కిరణ్ కుమార్ ఇంటి నుండి అశేష భక్తజన సందోహం మధ్య భాజా భజంత్రీలతో దర్గాకు గంధమును తీసుకొని స్వామి వారికి సమర్పిస్తారు. సోమవారం ఉరుసు, మంగళ వారం కిస్తీ ఉత్సవాలు ఉంటాయని తెలిపారు. ఆది, సోమ, మంగళవారాలలో జరిగే ఈ కార్యక్రమాలలో సి.బెళగల్ మండలంలోని ప్రజలే కాక గూడూరు, గోనెగండ్ల, ఎమ్మిగనూరు, తెలంగాణ రాష్ట్రం సుదూర ప్రాంతాల నుండి భక్తులు అశేషంగా వచ్చి స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించి అక్కడ ఇచ్చి స్వామివారి ప్రసాదాలను స్వీకరించి కృపకి పాత్రులవుతారు.

**నేడు పలుకుదొడ్డిలో బడేషా ఖాద్రి ఉరుసు ఉత్సవాలు:** మండలంలోని పలుకుదొడ్డిలో శనివారం బడేషాఖాద్రి ఉరుసు సందర్భంగా శనివారం గంధం వేడుకలు ఘనంగా జరిగాయి. నేడు ఉరుసు మహెూత్సవంలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకొని తరించాలని ముజావార్లు,దర్గా పెద్దలు ఈ సందర్భంగా అన్నారు.

## క్రీడలు అభ్యసన సామర్థ్యాన్ని పెంచుతాయి

**విశాలాంధ్ర – కర్నూలు:** విజయం సాధించిప్పుడు వాటి ఫలితాన్ని ఎలా నిర్వహించాలి, వైఫల్యాలను ఏ విధంగా ఎదుర్కోవాలో క్రీడలు నేర్పిస్తాయని హైస్కూలు ఆర్ అండ్ డీ విభాగము నరేష్, ఈ కిడ్స్ విభాగము ఆర్ అండ్ డీ రూప్ కోస్ తెలిపారు. స్కూల్ ఎజీఎం రమేశ్ కుమార్ ఆధ్వర్యంలో స్థానిక ఎల్కూర్ బంగ్లా నారాయణ పాఠశాల ఆవరణంలో శనివారం హైస్కూల్ విభాగం విద్యార్థులకు నారాయణ ప్రీమియర్ లీగ్ (ఎన్‌పీఎల్) పోటీలను స్వాగతోత్సవ నృత్యం అనంతరం క్రీడాజ్యోతిని వెలిగించి క్రీడలు ప్రారంభించారు.నిరంతరం క్రీడల్లో పాల్గొనే వ్యక్తి శారీరక, మానసిక వృద్ధిలో చెందడమే కాకుండా ఆత్మవిశ్వాసం కలిగి ఉంటారన్నారు. క్రీడలలో భాగస్వామ్యం అయినప్పుడే పిల్లలూ చదువు వైపు ఆకర్షితులవుతారని, అప్పుడే విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాన్ని పెంచుతుందన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ ప్రిన్సిపల్స్ అన్వర్ భాష, రామాంజనేయులు, శ్రీనివాసరెడ్డి, హై స్కూల్ కోఆర్డినేటర్స్ భాగ్యలక్ష్మి, ప్రిన్సిపల్స్ పాల్గొన్నారు.

## న్యాయ సేవా సదన్ నందు మహిళా దినోత్సవ వేడుక

**విశాలాంధ్ర – కర్నూలు ఎడ్యుకేషన్:** నగరంలోని స్థానిక జిల్లా కోర్ట్ ఆవరణలో గల న్యాయ సేవా సదన్ నందు అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ అధ్యరంలో ఘనంగా జరిగాయి. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ అధ్యక్షులు జి కబర్థి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షుడు ఎం.వెంకట హరినాథ్, మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి భూపాల్ రెడ్డి, ఏడో అదనపు జిల్లా న్యాయమూర్తి లక్ష్మి రాజ్యం, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి జోష్ణ దేవి, ఎక్సయిజ్ కోర్ట్ న్యాయమూర్తి సరోజనమ్మ, అన్ని కోర్టుల మహిళా సిబ్బంది పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో..

## గొర్రెలు, మేకల పెంపకందారుల సంక్షేమానికి కృషి చేయాలి

**విశాలాంధ్ర–పత్తికొండ:** రాష్ట్ర ప్రభుత్వం గొర్రె లు, మేకల పెంపకం దారుల సంక్షేమానికి కృషి చేయాలని ఆంధ్ర ప్రదేశ్ చేతి వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కారన్న డిమాండ్ చేశారు. గొర్రెలు, మేకల పెంపకం దారుల అభివృద్ధికి రాష్ట్ర బడ్జెట్‌లో రూ. 2500 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయం తర్వాత ప్రధానమైన రంగం పశు పెంపకమేనని తెలిపారు. గ్రామాలలో మూగ జీవాలకు పశు వైద్యం, బీమా ఇన్సూరెన్స్, పశుగ్రాసం వంటి మౌలిక సదుపా యాలు కల్పించాలన్నారు. గొర్రెలు, మేకల పెంపకం దారుల సమస్యల ను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 11న గుంటూ రులో గొర్రెలు, మేకల అభివృద్ధి సహకార ప్రధాన కార్యాలయం ఎదుట జరిగే ధర్నా కార్యక్రమానికి తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

## ఉత్సవానికి రూ.50వేల విరాళం

**విశాలాంధ్ర – హెూళగుంద:** మండలంలోని నేరణికిలో జరిగే నేరణికి లింగేశ్వర పట్టాద దేవర ఉత్సవానికి ఎమ్మెల్యే బి.విరుపాక్షి రూ.50 వేల విరాళాన్ని గ్రామ పెద్దలకు అందించారు. ఎమ్మెల్యే విరుపాక్షి మాట్లాడుతూ స్వామివారి ఉత్సవాన్ని భక్తిశ్రద్ధలతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో జరుపుకోవాలని కోరారు. గ్రామంలోని ప్రజలందరూ కలిసికట్టుగా దేవర ఉత్సవాన్ని జరుపుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వన్నమ్మ, వైసీపీ నాయకులు ఎస్కే సోమప్ప, సంఘం నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

**విశాలాంధ్ర – కోడుమూరు :** గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ భాగ్యరత్న ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగాయి. శనివారం పట్టణంలోని స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో ముందుగా సర్పంచ్ భాగ్యరత్న పారిశుధ్య కార్మికులతో కలిసి కేక్ కట్ చేసి పంచి పెట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ భాగ్యరత్న మాట్లాడుతూ దేశంలోనే కాక,అంతర్జాతీయ స్థాయిలో మహిళకు గుర్తింపు నివ్వడం చాలా ఆనందంగా ఉందన్నారు.కుటుంబంలో స్త్రీ ప్రధాన పాత్ర ఉందని రాజీకీయంగా పురుషులతో సమానంగా పోటీ పడటం హర్షించ దగ్గ విషయమన్నారు. అయినా మహిళకు రక్షణ లేదన్నారు. మహాత్మ గాంధీ అన్నట్లు స్త్రీ అర్ధరాత్రి ఒంటిరిగా బయట తిరిగి నప్పుడే నిజమైన స్వాతంత్రం వచ్చినట్లు, ఆ పరిస్థితి ఇంకా ఇప్పుడు కూడా లేదన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది జూనియర్ అసిస్టెంట్ సురేష్, పంచాయతీ సెక్రటరీ శ్రీకాంత్, హరి, ఉమర్, వాటర్ శేఖర్, రమేష్, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

## ప్రారంభమైన నెరణికి లింగేశ్వర స్వామి ఉత్సవాలు

**విశాలాంధ్ర–హెూళగుంద:** మండలంలోని నేరణికిలో శనివారం నేరణికి లింగేశ్వర స్వామి పట్టద దేవర ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల సందర్భంగా నేరణికి లింగేశ్వర స్వామితో పాటు గ్రామ వీధుల్లో భారీగా రంగు రంగుల విద్యుత్ దీపాలతో ఉత్సవ నిర్వాహకులు అలంకరించారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు, బంధుమిత్రులకు అన్నదాన కార్యక్రమాన్ని ఉత్సవ నిర్వాహకులు చేపట్టారు. నేరనికి లింగేశ్వర స్వామి రెండు రోజులపాటు ఘనంగా స్వామివారి ఉత్సవాలు, సామూహిక వివాహాలు జరుగుతాయని సర్పంచ్ ఎస్కే వన్నమ్మ శనివారం తెలిపారు. ఉత్సవంలో నేరణికి లింగేశ్వర స్వామి, గర్జిలింగేశ్వర స్వామి, కరూర్ లింగేశ్వర స్వామి, బొల్లూరేశ్వర స్వామి, దోనేకల్లప్ప వస్కేరప్ప స్వామి, అయ్యాలి లింగేశ్వర స్వామి, కారుమంచప్ప స్వామి, ఆగులూరు ఈశ్వర స్వామి, బలుకుందేశ్వర స్వామి, కొంచగిరి లింగేశ్వర స్వామి, కోలూరు ననికి లింగేశ్వర స్వామి లను పురవీధుల్లో బీరప్ప డోలుతో, పల్లకి సేవ చేస్తూ భక్తులు పురవీధుల్లో భారీ ఊరేగింపు నిర్వహించారు. సర్పంచ్ వన్నమ్మ, వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్కే గిరి, వైసీపీ నాయకుడు ఎస్కే సోమప్ప, టిడిపి నాయకులు ఈర నాగప్ప పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**విశాలాంధ్ర–కర్నూలు:** మండల పరిధిలోని చిన్న టేకూరు గ్రామ సమీపం లోని జాతీయ రహదారి ఎన్ హెచ్ 44లో పై ఓవర్‌కు దగ్గర్లో కర్నూలు వైపు నుండి వెల్దుర్తికి తండ్రి, కొడుకులు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా ద్విచక్ర వాహనం అదుపుతప్పి డివైడర్‌కు తగిలి కిందపడ్డారు. తండ్రి అక్కడికక్కడే మృతి చెందగా కుమారునికి గాయాలయ్యాయి, వివరాల్లోకెళ్తే.. మృతుడు ఎల్ల మద్దయ్య (55), కుమారుడు ఎల్ల స్వాములు వెల్దుర్తికి చెందినవారుగా గుర్తించారు. ఉలిందకొండ పోలీసులు కేసు నమోదు చేశారు.

# విజయవాడకు వెళ్ళే రైళ్లను పునరుద్ధరించాలి

**విశాలాంధ్ర బ్యూరో – కర్నూలు :** కరోనా సమయంలో రద్దు చేసిన కర్నూలు నుండి విజయవాడకు వెళ్లే రైలు తక్షణమే పునరుద్ధరించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి షాబీర్ భాష, డిహెచ్ పిఎస్ నగర కార్యదర్శి కుమార్‌రాజ లు డిమాండ్ చేశారు. శనివారం ఏఐటయూసీ, ఏఐవైఎఫ్,ఏఐఎస్ఎఫ్,డిహెచ్ పిఎస్ ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్ ముఖ ద్వారం వద్ద ఏఐటీయూసీ నగర కార్యదర్శి జి.చంద్రశేఖర్ అధ్యక్షతన ఆందోళన నిర్వహించారు.ఈ ఆందోళనను ఉద్దేశించి వారు మాట్లాడుతూ పాత రాజధాని కర్నూలు నగరం నుంచి కొత్త రాజధాని విజయవాడకు గతంలో మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ ఉండేదని, కరోనా సమయంలో భౌతిక దూరాన్ని పాటించాలనే నిబంధను పరిగణలోకి తీసుకుంటూ, అనేక రైలను రద్దు చేయడం జరిగిందన్నారు. గతంలో విజయవాడకు కర్నూలు జిల్లా ప్రజలు ఏ ఇబ్బందులు లేకుండా ప్రయాణం చేసి, సునయాసంగా చేరుకునే వారన్నారు. కర్నూలు జిల్లా ప్రజలకు, చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలకు ఏ సమస్య వచ్చినా, హైకోర్టు, సచివాలయం, ఇతర అంశాలు, పనులపై రాజధానికి వెళ్లాలంటే డోన్,నంద్యాల ప్రాంతాలకు వెళ్లి, విజయవాడకు వెళ్లాల్సి వస్తుందని తెలిపారు. ప్రజలు, వృద్ధులు, దివ్యాంగులు, తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. డోన్, నంద్యాల ప్రాంతాలకు రైలు ప్రయాణ సౌకర్యార్థం వెళ్తే, అక్కడ జనరల్ బోగీలలో కూర్చునేందుకు సీట్లులేని పరిస్థితి ఏర్పడిం దని, విజయవాడకు వెళ్లే ప్రతి రైలుకు అదనంగా జనరల్ బోగీలను కేటాయించాలని అన్నారు. కావున తక్షణమే రైల్వే అధికారులు, ఎంపీ స్పందించి, కర్నూలు నుంచి విజయవాడకు రైలు పునరుద్దరించాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సీపీఐ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో దశలవారీగా ఉద్యమాలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని వారు హెచ్చరించారు. ఈ ఆందోళనలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సోమన్న, జిల్లా సహాయ కార్యదర్శి శరత్ కుమార్, నాయకులు చింటు, భరత్, మహమ్మద్, ఏఐవైఎఫ్ నగర అధ్యక్షులు నాగరాజు, నాయకులు అఖిల్, కళాకార్,చంటి, రంగన్న, ఏఐటీయూసీ నగర డిప్యూటీ కార్యదర్శి రామాంజనేయులు, నాయకులు నల్లన్న, కృష్ణ, అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

# డ్రైనేజీలో తాగునీటి పైప్‌లైన్

**విశాలాంధ్రు–హెూళగుంద:** హెూళగుంద జిల్లా పరిషత్ హై స్కూల్లో నాలుగు మీడియంలో దాదాపు 2 వేల మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. విద్యార్థులకు తగ్గట్టు రెండు ట్యాంకులు ద్వారా తాగు నీటిని అధికారులు సరఫరా చేస్తున్నారు. ట్యాంకుకు అమర్చిన పైప్ లైన్ డ్రైనేజీలో ఉండడంతో ఆ పరిశుద్ధమైన నీరు ట్యాంకర్లు చేరుతుందని ప్రజలు ఆవేదన చెందారు. డ్రైనేజీ లో ఉన్న పైప్లైన్ పగిలిపోయి నీరు డ్రైనేజీలో వృధాగా పోతుందని, ట్యాంకులో నీటిని ఎక్కించేటప్పుడు డ్రైనేజీ నీరు ట్యాంకులో చేరుతున్నా యని ప్రజలు వాపోయారు. కలుషిత నీరు తాగి ఆదోని, ఆత్మకూర్ ప్రాంతాల్లో కొందరు డయేరియా వ్యాధితో మరణించిన సంఘటన ఉన్నాయి. వేసవి ఎండలు తీవ్రంగ ఉన్నాయని విద్యార్థులు కలిసి నీటిని తాగి, డయేరియా వ్యాధికి సోకితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రజలు అధికారులను ప్రశ్నించారు. అధికారులకు డ్రైనేజ్‌లో ఉన్న మంచినీటి పైప్ లైన్ను మరమ్మతు చెయ్యాలని ఎన్నోసార్లు చెప్పినా ఎవరు పట్టించుకోలేదని వాపోయారు. పైప్‌లైన్ ఎన్నోసార్లు పగిలిపోయి నీరు వృధా కావడమే కాక డ్రైనేజీ నీరు ట్యాంకర్లు చేరుతున్న సందర్భంగా అధికారులు కేవలం రెండు రాళ్లు అడ్డంగా పెట్టి చేతులు దులుపుకున్నారని ప్రజలు పేర్కొన్నారు. అధికారులు నిర్లక్ష్యాన్ని విద్యార్థుల బంగారు భవిష్యత్తు కాపాడడానికి డ్రైనేజీలో ఉన్న మంచినీటి పైపులైను మరమ్మతు చేసి, విద్యార్థులకు మంచినీరు అందించాలని ప్రజలు కోరారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

**విశాలాంధ్ర– వెల్దుర్తి:** పట్టణానికి చెందిన ఎల్ల మద్దయ్య ఉరఫ్ ఎల్లమద్దిలేటి (49) శనివారం కల్లూరు మండలం ఉలిందకొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని హైవే 44 పై చిన్నటేకూరు వద్ద జరిగిన బైక్ ప్రమాదంలో దుర్మరణం చెందాడు. ఉలిందకొండ ఎస్ఐ ధనుంజయ, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు వెల్దుర్తి ఎల్లమ్మ గుడి పూజారి ఎల్లమద్దిలేటి తన కుమారుడు బీటెక్ చదువుతున్న ఎల్లస్వామితో కలిసి బైక్పై వెల్దుర్తి నుంచి కర్నూలుకు ఆరోగ్య పరీక్షల నిమిత్తం వెళ్లాడు. సాయంత్రం తిరిగి వస్తుండగా చిన్నటేకూరు తడకనపల్లె క్రాస్, బృందావన్ కాలేజీ ఎదురుగా వెనుక నుంచి గుర్తుతెలియన వాహనం వీరి బైక్‌ను ఢీకొంది. బైక్ అదుపుతప్పి డివైడర్ను ఢీకొట్టి పల్టీలు కొట్టింది. బైకిపై నున్న ఇద్దరు క్రిందపడ్డారు. బైక్ వెనుక కూర్చున్న తండ్రి ఎల్లమద్దిలేటి రోడ్డుపై పడి తీవ్ర రక్తగాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్ నడుపుతున్న ఎల్లస్వామి స్వల్పగాయ లపాలయ్యాడు. విషయం తెలుసుకున్న ఉలిందకొండ పోలీసులు, మృతుని కుటుంబ సభ్యులు సంఘటనాస్థలికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కర్నూలు ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. సంఘటనా ప్రాంతంలో తండ్రి మృతదేహం వద్ద కుమారుడి రోదన కంటతడి పెట్టించింది. మృతునికి భార్య లక్ష్మిదేవి, కుమారుడు, డిగ్రీ చదువుతున్న కుమార్తె ఉన్నారు.

## శ్రీ సీతారాముల వారికి రథం బహుకరణ

**విశాలాంధ్ర – తుగ్గలి:** మండల బలుగు బలహీన వర్గాల ప్రజలకు అతనొక ఆప్తుడు,కులమతాలకు అతీ తంగా పెళ్లి చేసుకొనే ప్రతి జంట పెద్దలు అతనిని కలుస్తే తనవంతు సహాయంగా తాళి, మెట్లు, పెళ్లి వస్త్రాలతో పాటు ఆర్థిక సహాయం చేసే గుణమున్న వాడు, ప్రభుత్వ కార్యాలయాలకు భూమిని దానం చేసిన దాత, గ్రామంలో పార్టీలకు అతీతంగా అడిగిన ప్రతి కుటుంబానికి ఇల్లు నిర్మించుకోడానికి స్థలం ఇచ్చిన దయాగునుడు, ఇప్పుడు మండల కేంద్రంలోని శ్రీ సీతారాముల ఆలయానికి రథాన్ని చేయించిన ప్రజల మినిషి అతనే రాష్ట్ర కార్యనిర్వాహక సహాయక కార్యదర్శి, మాజీ శాలివాహన ఫెడరేషన్ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర, ఈ సేవలన్ని ఎవరి సహాయం అర్థించకుండా తన సొంత ఖర్చులతో చేయడం పట్ల ప్రజలు హర్షిస్తున్నారు.

## అధైర్య పడొద్దు అండగా ఉంటాం : వైసీపీ

**విశాలాంధ్ర – పెద్దకడబూరు :** మండలంలోని చిన్నతుంబళం గ్రామంలో మంగళి మల్లేష్ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైసీపీ రైతు విభాగం తాలూకా అధ్యక్షులు కేపీ యల్లప్ప, నాయకులు బోయ కడబూరి, మహదేవ శనివారం మల్లేష్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. అధైర్య పడొద్దని అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి తరుపున మట్టి ఖర్చులకు రూ. 5 వేలు ఆర్థిక సహాయం అందజేశారు.

**చంద్రన్న బీమాను అమలు చేయని కూటమి ప్రభుత్వం :** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు గడుస్తున్నా నేటికీ చంద్రన్న బీమా పథకం అమలు చేయకపోవడం దారుణమని వైసీపీ రైతు విభాగం తాలూకా అధ్యక్షులు కేపీ యల్లప్ప, నాయకులు బోయ కడబూరి, మహదేవ విమర్శించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కుటుంబ యజమాని మరణిస్తే వైఎస్ఆర్ బీమా పథకం ద్వారా ఆ పేద కుటుంబానికి బీమా మొత్తం చెల్లించి అండగా నిలిచేదని గుర్తు చేశారు. ఉన్న వైఎస్ఆర్ బీమా పథకాన్ని చంద్రబాబు ముఖ్యమంత్రిగా గద్దెనెక్కగానే రద్దు చేశారని ఆరోపించారు. చంద్రన్న బీమా పథకాన్ని అమలు చేస్తామని ప్రకటించి 9 నెలలు గడుస్తున్నా అమలు చేయక పోవడంతో యజమానని కోల్పోయిన పేద కుటుంబాలకు వీధిన పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి చంద్రన్న బీమా పథకాన్ని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## నగర అభివృద్ధి అందరి బాధ్యత

**విశాలాంధ్ర–గూడూరు:** నగర పంచాయతీ అభివృద్ధి అందరి బాధ్యతని నగర పంచాయతీ నూతన అభివృద్ధి కమిటీ సభ్యులు అన్నారు. శనివారం మండల పరిషత్తు సమావేశ భవనంలో స్థానిక ఎమ్మార్పీఎస్ నాయకులు సుభాకర్ అధ్యక్షతన నూతన అభివృద్ధి కమిటీని వైసిపి, టీడిపి ప్రజా ప్రతినిధులు, ప్రజా సంఘాలు కలిసి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా టీచర్ పైగేరి నాగరత్నరావు, కో కన్వీనర్ గా తిరుమల్ రెడ్డి, సభ్యులుగా రఘునాథ్, విశ్వనాథ్, నాగమల్లయ్య,గోట్ల భాస్కర్, మిన్నెళ్ల తదితరులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ గూడూరు నగర పంచాయతీ అభివృద్ధికి పార్టీలకు అతీతంగా రాజకీయ నాయకులు ముందుకు రావాలని కోరారు. నేటి నుండి గూడూరు నగర్ అభివృద్ధిపై నూతన కమిటీ సభ్యులు నిరంతరం కృషి చేయాలని పలువురు రాజకీయ నేతలు సూచించారు.

# అన్న క్యాంటీన్ల నిర్వహణ అద్భుతం

**విశాలాంధ్ర – కర్నూలు సీటీ :** నగరంలో అన్న క్యాంటీన్ల నిర్వహణ అద్భుతంగా ఉందని, దానికి ప్రజల ఫీడ్‌బ్యాక్‌కే నిదర్శనమని నగరపాలక కమిషనర్ యస్.రవీంద్ర బాబు అన్నారు. శనివారం ఆయన పాత బస్టాండ్, కలెక్టరేట్, ప్రభుత్వ ఆసుపత్రిలోని అన్న క్యాంటీన్లను ఆకస్మిక తనిఖీలు చేశారు. టిఫిన్ చేస్తున్న లబ్దిదారులను ఆత్మీయంగా పలకరించి, ఆహార రుచి, శుభ్రత, నిర్వహణలపై ఆరా తీశారు. అక్కడే ఉన్న మహిళలకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అన్న క్యాంటీన్ల నిర్వాహకులకు కమిషనర్ పలు సూచనలు చేశారు. మెనూలో ఉన్న ఆహార పదార్థాలను, స్వచ్ఛమైన తాగునీరును ప్రజలకు తప్పనిసరిగా అందించాలని, ఆవరణలో శుభ్రత, డస్ట్‌బిన్లు ఉండేలా చూసుకోవాలన్నారు. ఏవైనా సమస్యలుంటే నగరపాలక అధికారులతో సమన్వయం చేసుకొని పరిష్కరించుకోవాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా నిర్వహణ సక్రమంగా ఉండాలని సూచించారు. అనంతరం మెనూ, భోజనం వడ్డింపు, టోకెన్ల జారీ విధానాన్ని కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలు బయటకు వచ్చినప్పుడు భోజనం కోసం వందల రూపాయలు ఖర్చు చేయలేక పస్తులు ఉంటారని, వారిని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం రూ.5 కే భోజనం అందించే అన్న క్యాంటీన్ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. అర్హతలేమి లేకుండా కేవలం

రూ.5 ఉంటే చాలు, పెద్ద హెూటల్లో అందించేంత మెనూతో, అత్యంత ఆహ్లాదకరమైన వాతావరణంలో మూడు పూటలా ప్రజలు భోజనం చేయవచ్చన్నారు. నగరంలో అన్న క్యాంటీన్లు అద్భుతంగా, సంతృప్తికరంగా ఉన్నాయంటూ, భోజనం చేసిన లబ్దిదారుల్లో 93.18 శాతం తమ ఫీడ్‌బ్యాక్‌లో తెలిపారని వెల్లడించారు. నగరంలో ఐదు మాసాల క్రితం 5 అన్న క్యాంటీన్లను ప్రారంభించగా, ఇప్పటికీ 7,20,652 మంది భోజనం చేశారని కమిషనర్ అన్నారు.

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల
www.visalaandra.com
కర్నూలు, ఆదివారం 09, మార్చి 2025

# మహిళలు ఆరోగ్యంపట్ల జాగ్రత్తలు తీసుకోవాలి

**విశాలాంధ్ర బ్యూరో – కర్నూలు :** మహిళలు, బాలికల భద్రతే ధ్యేయమని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఎపిఎస్పీ కమాండెంట్ 2వ బెటాలియన్ దీపికా పాటిల్‌లు శనివారం తెలిపారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సంధర్భంగా కర్నూలు జిల్లా పోలీసు కార్యాలయంలోని పరేడ్ మైదానంలో కర్నూలు అమీలియో హాస్పిటల్, కర్నూలు ఒమేగా హాస్పిటల్స్ డాక్టర్ల ఆధ్వర్యంలో పోలీసు కుటుంబాల మహిళల కోసం ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరం ను జిల్లా ఎస్పీ, ఎపిఎస్పీ 2 వ బెటాలియన్ కమాండెంట్ లు ముఖ్య అతిథులుగా విచ్చేసి ఉచిత మెగా వైద్య శిబిరం ను ప్రారంభించారు. మహిళలందరికి అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. స్పెషలిస్టు డాక్టర్లచే ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. వివిధ రంగాల్లో మహిళా సాధికారతను పెంపొందించాలన్నారు. వారి కృషిని అభినందించాలన్నారు. లింగ సమానత్వం పై ప్రజల్లో అవగాహన కల్పించడమే నేటి ముఖ్య ఉద్ధేశమన్నారు. ఎపిఎస్పీ 2వ బెటాలియన్ కమాండెంట్ దీపికా పాటిల్ మాట్లాడుతూ మహిళలు భర్త, పిల్లల గురించే ఎప్పుడూ ఆలోచిస్తారే కానీ మహిళలు ఎప్పుడూ తమ ఆరోగ్యం గురించి ఆలోచించరన్నారు. ఎదైనా అత్యవసరమైతే తప్ప హాస్పిటల్ కు వెళ్ళరన్నారు. మహిళలు సరైన అవగాహన లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారని, ఆరోగ్య సమస్యలుంటే ప్రాథమిక దశలోనే గుర్తించి వైద్య పరీక్షలు చేయించుకుని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మన కోసం, మన ఆరోగ్యం కొరకు రోజూ కొద్ది సేపు సమయం కేటాయించి నడక, యోగా వంటివి చేయాలన్నారు. అమీలియో, కర్నూలు నందికొట్కూరు రోడ్డులో ఉన్న ఒమేగా క్యాన్సర్ హాస్పిటల్ డాక్టర్లను శాలువతో సన్మానించి, మెమెంటోలు అందజేశారు. డిఈకో, ఈసిజి, బిపి, షుగర్, హెచ్ బీ, కంటీ పరీక్షలను అమిలీయో హాస్పిటల్ డాక్టర్లు నిర్వహించారు. పాప్ స్మియర్, మమోగ్రఫీ, బిపి, షుగర్ పరీక్షలను ఒమెగా హాస్పిటల్ డాక్టర్లు నిర్వహించారు. మొత్తం 324 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మెడిసిన్ ను పంపిణీ అందజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా, ఎఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్, కర్నూలు అమీలియో హాస్పిటల్ డాక్టర్లు లక్ష్మీ ప్రసాద్, శృతి, రేవతి, విజయలక్ష్మి, విష్ణుచంద్రిక, మునీరా బేగం, పవన్ తేజ ఒమెగా హాస్పిటల్ డాక్టర్లు ఆదిత్య, శిల్ప, మార్కెటింగ్ టీం షేక్షావలి, రంజిత్ కుమార్, పోలీసు వేల్ఫేర్ యూనిట్ హస్పిటల్ డాక్టర్ శ్రీమతి ఆర్. స్రవంతి, డిఎస్పీలు శ్రీనివాసాచారి, బాబు ప్రసాద్, ట్రైనీ డిఎస్పీ ఉషశ్రీ, బాష, భాస్కర్ రావు, ప్రసాద్, సిఐలు, ఆర్ ఐలు, ఆర్ ఎస్సైలు, మహిళా పోలీసులు, మహిళా హోంగార్డులు, పోలీసు కుటుంబాల మహిళలు పాల్గొన్నారు.

## స్వయం సాధికారత కోసం పాటుపడిన పార్టీ టీడీపీ

**విశాలాంధ్ర బ్యూరో – నంద్యాల :** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా నిర్వహించినట్లు టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి షేక్ వహీద్ హుస్సేన్ తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు కేక్ కట్ చేసి, మహిళా సాధికారతపై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ స్వర్గీయ ఎన్టీ రామారావు మహిళలకు ఆస్తి హక్కును కల్పించారని పేర్కొన్నారు. టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి షేక్ వహీద్ హుస్సేన్ మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళా స్వయం సాధికారత సాధించడంలో తెలుగు దేశం పార్టీ కీలక పాత్ర పోషించిందని, నేడు మహిళలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పారిశ్రామిక, వ్యాపార రంగాలలో రాణిస్తున్నారని కొనియాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మహిళలకు చట్ట సభల్లో స్థానం కల్పించి, వారి ఎదుగుదలకు సహకరించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛ భారత్ మిషన్ చైర్మన్ పట్టాభి, టీడీపీ నాయకురాలు దుర్గా చౌదరి, రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు పాల్గొన్నారు. కేంద్ర కార్యాలయంలో పని చేస్తున్న కార్మికులకు చీరలు పంపిణీ చేశారు.

## మహిళ సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

**విశాలాంధ్ర – ఆత్మకూరు టౌన్:** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మహిళల అభివృద్ధి కొరకు నిరంతరం కృషి చేస్తున్నారని శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం నందు జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించడం జరిగింది. వివిధ రంగాల్లో స్వయం ఉపాధి పొందుతున్న ఆదర్శ మహిళలను సన్మానించి, ఆర్థిక సహాయం శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మహిళా సంక్షేమం కొరకు పెద్దపీట వేస్తుందన్నారు. మహిళలకు అమలు చేయబోయే సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ రత్న రాధిక, మండల అధికారులు, టిడిపి నాయకులు వేణు, అబ్దుల్లాపురం భాష, శివ ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**విశాలాంధ్ర – చాగలమర్రి:** మండలంలోని గొడెగనూరు ఉన్నత పాఠశాల లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం ఓబుళపతి ఆధ్వర్యంలో ఎంఈఓ అనురాధతో పాటు పాఠశాలలో పనిచేస్తున్న మహిళా ఉపాధ్యాయులు విజయ లలితమ్మ, ఎస్తేర్‌రాణి, విజయమణి, కస్తూరిలను శాలువలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు హుసేన్ వలి, రవిశంకర్ రెడ్డి, మహేంద్ర, రమేష్‌బాబులు పాల్గొన్నారు.

**విశాలాంధ్ర – శిరివెళ్ల:** మండల పరిధిలోని ఆయా గ్రామాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ మండల వైస్ ఎంపీపీ, గ్రామ పంచాయతీ సర్పంచులు ఘనంగా నిర్వహించారు. మహిళా దినోత్సవం సందర్భంగా నారీమణులకు గ్రామపంచాయతీ మహిళా సర్పంచ్‌లు క్రీడా పోటీలు నిర్వహించి ప్రోత్సాహక బహుమతులు పంపిణీ చేశారు. యర్రగుంట్ల డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు మహిళా అధ్యాపకులకు పోటీలు నిర్వహించి, ప్రిన్సిపల్ డాక్టర్ జి.ఇంద్రావతి ప్రోత్సాహక బహుమతులు పంపిణీ చేశారు.

**విశాలాంధ్ర – ఆళ్లగడ్డ:** మహిళల అభ్యున్నతే ధ్యేయంగా కెవి సుబ్బారెడ్డి విద్యా సంస్థలు కృషి చేస్తున్నాయని కె.వి.సుబ్బారెడ్డి కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనాథ్ రెడ్డి అన్నారు. పట్టణంలోని కెవి సుబ్బారెడ్డి విద్యాసంస్థల్లో శనివారం అంతర్జాతీయ మహిళ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ ఉమాదేవి పోలీసు వారి నేతృత్వంలో వ్యాసరచన పోటీలలో ప్రతిభ చాటిన యాగ్నేశ్వరి, బాల దస్తగిరమ్మలను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ శ్రీనాథ్ రెడ్డి, అధ్యాపక బృందం, దేశ్ పాండే టీం తదితరులు పాల్గొన్నారు.

**విశాలాంధ్ర –కోవెలకుంట్ల:** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని కోయిలకుంట్ల పట్టణంలో శనివారం ఘనంగా నిర్వహించారు. కోవెలకుంట్ల కో–ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మహిళా దినోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి సతీమణి బీసీ ఇందిరమ్మ హాజరయ్యారు. బీసీ ఇందిరమ్మ సంస్కృత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈవో ప్రకాష్ నాయుడు, డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, కో–ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ చైర్మన్ సముద్రాల శ్రీనివాసులు, బ్యాంకు సిబ్బంది, ఆర్యవైశ్య సంఘం ప్రెసిడెంట్ పెండెకంటి సుబ్రమణ్యం, ఆర్యవైశ్య సంఘం యువ నాయకులు అభిలాష్, ఇస్కాల ప్రసాద్, కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గడ్డం రామకృష్ణారెడ్డి, గడ్డం అమర్నాథ్ రెడ్డి, టిడిపి యువ నాయకులు పెనుగొండ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

**విశాలాంధ్ర – నందికొట్కూరు :** పట్టణంలోని పారడైస్ ఫంక్షన్ హాల్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే దంపతులు పాల్గొని అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో మహిళల పాత్ర గురించి వారి అభివృద్ధి గురించి వివరించడం జరిగినది.

## శేషవాహనం, చంద్రప్రభ వాహనంపై దర్శనమిచ్చిన శ్రీ జ్వాల నరసింహస్వామి

**విశాలాంధ్ర – ఆళ్లగడ్డ :** ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన అహోబిలం లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో బ్రహ్మోత్సవాలు అహోబిలం జనరల్ మేనేజర్ మురళీధరన్, జాబితా సలహా సభ్యులు వైకుంఠం, మణిందర్, అడ్మినిస్ట్రేషన్ అధికారి సుదర్శన్‌ల ఆధ్వర్యంలో కన్నుల పండుగలా జరుగుతున్నాయి. అందులో భాగంగా ఐదవ రోజైన శనివారం ఉదయం జ్వాల నరసింహ స్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను ప్రత్యేకంగా పట్టు వస్త్రాలు, పూలమాలలతో అలంకరించి శేష వాహనంపై కొలువుదీర్చి పూజలు నిర్వహించిన బోయిలు శేష వాహనంపై కొలువుదిరిన స్వామి అమ్మవార్ల పల్లకికి ఊంజల సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉభయదారులుగా మైదుకూరు తహసిల్దార్ రాజ సింహ నరేంద్ర వ్యవహరించారు. మధ్యాహ్నం ఉత్సవముమూర్తులకు అర్చకులు వేదమంత్రాల మధ్య పంచామృతాభిషేకం నిర్వహించారు. రాత్రి శ్రీ జ్వాల నరసింహ స్వామి చంద్రప్రభ వాహనంపై కొలువు దీరి భక్తులకు దర్శనమిచ్చారు. పూజల అనంతరం చంద్ర ప్రభ వాహనంపై స్వామివారిని కూర్చొండబెట్టి ఆలయ మాడ వీధులగుండా గ్రామోత్సవం నిర్వహించారు.

**దిగువ అహోబిలంలో:** దిగువ అహోబిలంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా నాలుగవ రోజైన శనివారం శ్రీ యోగానంద నృసింహ గరుడ విమాన సేవ అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలాచార్యులు ఆధ్వర్యంలో అర్చక బృందం వేకువజామునే అర్చక బృందంతో కలిసి ఉత్సవమూర్తులైన ప్రహ్లాద వరద స్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం యోగానంద నృసింహ గరుడ విమాన వాహనంలో కొలువుంచి ఆలయ మాడ వీధుల గుండా ఊరేగింపుగా మఠం వద్దకు చేరుకున్నారు. మఠం వద్ద 46వ పీఠాధిపతి శ్రీవన్ శ్రీ శఠగోప రంగనాథ యతీంద్ర మహాదేశికన్ స్వామి ఉత్సవ మూర్తులకు మహా మంగళ హారతి సమర్పించి పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఉత్సవమూర్తులకు ప్రధాన అర్చకులు అభిషేకం నిర్వహించారు. రాత్రి హనుమంత వాహనంపై శ్రీ ప్రహ్లాద వరద స్వామి కొలువుదీర్చి మాడ వీధుల గుండా గ్రామోత్సవం నిర్వహించారు.

## కిమ్స్ హాస్పిటల్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

**విశాలాంధ్ర బ్యూరో – కర్నూలు :** ప్రతి మహిళా తమ ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని డిస్ట్రిక్ట్ మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ డా.శాంతికళ సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కిమ్స్ హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలందరూ ఇప్పుడు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. మగవారితో సరిసమానంగా సమాజంలో గౌరవం పొందుతున్నారు. వారిలో వచ్చే సమస్యలపై ఇంకా పూర్తి అవగాహన పొందలేకపోతున్నారు. 35 ఏళ్లు దాటిన ప్రతి మహిళ తప్పని సరిగా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కొన్ని వ్యాధులను మనం ముందే పసిగట్టడం వల్ల చికిత్సల చేసి నయం చేసే అవకాశం ఉందన్నారు. అంతేకానీ ఏదైన ఆరోగ్య సమస్య వస్తే తప్పకుండా వైద్యుల వద్దకు వెళ్లాలని అన్నారు. కిమ్స్ హాస్పిటల్ సాధారణ ప్రసవాల కోసం వైద్యులు చేస్తున్న కృషిని అభినందించారు. అనంతరం కిమ్స్ హాస్పిటల్ సిఓఓ డా.సునీల్ సేపూరి మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళల కోసం ప్రత్యేక హెల్త్ చెకప్ ప్యాకేజీతో పాటు, గుండె సంబంధిత పరీక్షల కోసం ప్రత్యేక ప్యాకేజీలను అందుబాటులోకి తీసుకవచ్చాం. ఈ అవకాశాన్ని కర్నూలులోని ప్రతి మహిళాకు ఉపయోగపడుతుందన్నారు. మహిళా ఆరోగ్యంగా ఉంటేనే ఆ ఇల్లు బాగుటుందన్నారు. కాబట్టి ఆరోగ్య సమస్యలపై అవగాహన ఉండాలన్నారు. కిమ్స్ కడల్స్‌లో సాధారణ ప్రసవాల కోసం వైద్యులు నిరంతరం కృషి చేస్తున్నారని, కిమ్స్ కడల్స్ హాస్పిటల్ నందు సుఖ ప్రసవాలు గురించి గర్భిణీలకు లమాజ్, యోగ, ఫిజియోథెరఫీ, మొదలగు కార్యక్రమాలను చేస్తున్నారని తెలిపారు. గతంతో పోలిస్తే ఇప్పుడు సాధారణ ప్రసవాల సంఖ్య పెరగిందన్నారు. గైనకాలజీ విభాగాధితి డా.లక్ష్మి ప్రసన్న మాట్లాడుతూలి పురుషులతో పోలిస్తే మహిళల్లో ఆరోగ్య సమస్యలు ఎక్కువగా వస్తుంటాయి. ప్రత్యేకంగా మహిళల కోసం కొన్ని రకాల పరీక్షలు ఉంటాయి. క్రమం తప్పకుండా ఆయా పరీక్షలు చేయించుకోవడం వలన భవిష్యత్తులో వచ్చే ఆరోగ్య సమస్యలను అరికట్టవచ్చన్నారు. ప్రధానంగా హెచ్‌పివి వ్యాక్సిన్ తీసుకోవడం వలన సర్వైకల్ క్యాన్సర్‌ని అరికట్టవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కిమ్స్ వైద్యులు డా.అరుణ, డా.శిల్ప, డా.కుసుమ, డా.సుష్మ, డా.శృతి, డా.సాహితి, డా.శ్వేత, సిబ్బంది పాల్గొన్నారు.

## నగరంలోని పలు పాఠశాలల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

**విశాలాంధ్ర – కర్నూలు ఎడ్యుకేషన్:** ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కళాశాలలో శనివారం నాడు ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.నాగస్వామి నాయక్ అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మహిళా దినోత్సవం సందర్భంగా కళాశాలలోని మహిళా సిబ్బందిని ఘనంగా సన్మానించారు. కళాశాల లెక్చరర్స్ జబీన్ అక్తర్, సుజాత, లక్ష్మి, శ్రావణి, జెసింత, లావణ్య పాల్గొన్నారు.

స్థానిక గణేష్ నగర్‌లోని హారిజాన్స్ ఇంటర్నేషనల్ ప్లే స్కూల్ వార్షికోత్సవం నేడు ఘనంగా జరిగింది. పాఠశాల ఛైర్మన్ ప్రదీప్ కుమార్, అకాడమిక్ డైరెక్టర్ పి.పావనిల అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కర్నూలు జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.శ్యాముల్ పాల్ హాజరయ్యారు. విశిష్ట అతిథిగా రవీంద్ర విద్యాసంస్థల వ్యవస్థాపకులు జి.పుల్లయ్య విచ్చేశారు. ఈ కార్యక్రమంలో డీఈవో శామల్ పాల్ మాట్లాడుతూ ఒక విద్యార్థి భవిష్యత్తులో గొప్పగా ఎదగడానికి పునాది ప్రీ ప్రైమరీ ఎడ్యుకేషన్ అన్నారు. ప్రీ ప్రైమరీ ఎడ్యుకేషన్‌లో గొప్ప శిక్షణను అందివ్వడం విద్యార్థులకు తల్లిదండ్రులు అందించే గొప్ప బహుమానం అన్నారు ఎందుకంటే ప్రతి తల్లి తండ్రి తమ పిల్లలు ఇంకా చిన్న పిల్లలే కదా అని భావిస్తూ నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు.

నగరంలోని రవీంద్ర మహిళా ఇంజనీరింగ్ కళాశాల జి.పుల్లయ్య ఇంజనీరింగ్ కళాశాల, రవీంద్ర డిగ్రీ కళాశాల, రవీంద్ర పాఠశాలల్లో నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వేడుకలు ఘనంగా నిర్వహించారు. రవీంద్ర మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన ముగ్ధ 2025 కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కర్నూలు జిల్లా జాయింట్ కలెక్టర్ బి.నవ్య ,జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్ సి.సరళాదేవి పూర్వవిద్యార్థులు కె.వి.దీప్తి, కె.మల్లిక విచ్చేశారు. రవీంద్ర విద్యాసంస్థల సీఈవో డాక్టర్ జి.మమతా మోహన్ మాట్లాడుతూ ఎక్కడ స్త్రీ పూజింపబడుతుందో అక్కడ సమస్త దేవతలు ఆనందిస్తారన్నారు. రవీంద్ర మహిళా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కేఈ శ్రీనివాసమూర్తి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఉషారాణి ,వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అబ్బాస్ నగర్ లోని రవీంద్రా పాఠశాలలలో మహిళా దినోత్సవ సంబరాలు ఘనంగా జరిగాయి. రవీంద్ర విద్యా సంస్థల్లో పనిచేస్తున్న మహిళా ఉపాధ్యాయులకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించి, విజయం సాధించిన ఉపాధ్యాయులకు రవీంద్ర విద్యాసంస్థల వ్యవస్థాపకులు జి. పుల్లయ్య, రవీంద్ర విద్యాసంస్థల సీఈవో డాక్టర్ జి. మమతా మోహన్ బహుమతులు ప్రధానం చేయడం జరిగినది.

## గోనెగండ్లలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

**విశాలాంధ్ర –గోనెగండ్ల:** అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం మండల కేంద్రమైన గోనెగండ్లలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథులుగా జిల్లా డీపీఓ జి.భాస్కర్,డీఎల్ పీఓ నూర్జహాన్, రాష్ట్ర అబ్జర్వేషన్ ఆఫీసర్, క్రిష్ణాగిరి నాగేశ్వరరావు,డీపీఆర్సీ మాస్టర్ ట్రైనర్ గిడ్డేష్, సీఐ గంగాధర్,హాజరు అయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా బలపడాలి, సమాజంలో గౌరవంగా బతకాలి, వివక్ష లేకుండా స్వేచ్ఛగా జీవించాలి, మహిళలందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ రోజు గోనెగండ్ల గ్రామ పంచాయతీ మహిళా మరియు బాలికల స్నేహపూర్వక గ్రామ పంచాయతీలుగా అభివృద్ధి చేయాలి.గ్రామ పంచాయతీ లను మహిళలు దృష్టి సారించాలని సూచించారు.వివిధ సామాజిక భద్రతా పథకాలతో సహా మహిళలు, బాలికలకు సంబంధించిన వివిధ సంక్షేమ పథకాల లభ్యత గురించి, బాలికల విద్యను పెంపొందించడం, బాలికల డ్రాప్ అవుట్ తగ్గించడం మహిళలు, బాలికలకు వృత్తి నైపుణ్యాల శిక్షణ, లాభదాయకమైన ఉపాధి గురించి చర్చించడం.బ్యాంకు క్రెడిట్ తో మహిళలు పొదుపు గ్రూప్‌లను, అనుసంధానం, నైపుణ్య శిక్షణ, మార్కెటింగ్ టైఅప్‌లను, నిర్ధారించడం, మహిళా రైతులకు శిక్షణ, సబ్సిడీలు, వ్యవసాయ పరికరాలతో అనుసంధానం గురించి వివరించారు. అనంతరం మహిళా వార్డు సభ్యులు, గ్రామ సర్పంచ్, పంచాయతీ సీప్పర్ లకు, అంగన్వాడీ కార్యకర్తలు, అశ కార్యకర్తలకు, వీరికి షాలువా, పూలమా లలతో సన్మానం చేశారు. జీనియస్ గ్లోబల్ ప్రిన్సిపాల్ జైబ, కస్తూరిబా స్కూల్ సిబ్బంది, గ్రామ సర్పంచ్ పూజారి హైమవతి, పంచాయతీ కార్యదర్శి సతీష్ కుమార్, వార్డు సభ్యులు, అక్బర్, సజ్జలు హసీనా,భారతం షహీనా, పంచాయతీ సిబ్బంది మల్లాంగ్, సుభాన్, అనిల్, విరుపాక్షి, క్రిష్ణ, రంగస్వామి, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

**విశాలాంధ్ర – కర్నూలు వైద్యశాల:** కర్నూలు మెడికల్ కళాశాలలో శనివారం ఉదయం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టి నరసింహ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందు ఉంటారని వైద్యరంగంలో కూడా మహిళల సేవలు మరువలేనవని అన్నారు. కర్నూలు వైద్య కళాశాలలోని కౌన్సిల్ హాల్ నందు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని సీనియర్ మహిళా ప్రొఫెసర్స్, హెచ్‌ఓడిలను సన్మానించడం జరిగింది. మొదటగా సీనియర్ రిటైర్డు ప్రొఫెసర్ పి.ఎస్.జిక్కిని, వివిధ విభాగాల విబాగాధిపథులు, ప్రొఫెసర్లు డా.శోభాదేవి, డా.అమీరున్ని సాబేగం, డా.రాధారాణి, డా.విశాల, డా.మంజుల, డా.రూత్ లావణ్య, డా.శ్రీలక్ష్మి, డా.మంజులాబాయి, డా.మాధవీ శ్యామల మొదలగు వారిని సన్మానించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**విశాలాంధ్ర – హొళగుంద:** హొళగుంద సచివాలయం–1 ఒకటిలో శనివారం ప్రపంచ మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని సర్పంచ్ చెలువాది రంగమ్మ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ కార్యదర్శి రాజశేఖర్ గౌడ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని కోరారు. సమాజంలో మహిళల శక్తి అపరమైనదనీ స్త్రీ లేనిదే లోకం లేదని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ నూర్జహాన్, వైస్ ఎంపీపీగా దెమ్మ,మండల బిజెపి కన్వీనర్ ఈడిగ సుధా,బిజెపి మాజి మండల కన్వీనర్ ప్రసాద్, వైసీపీ నాయకుడు పంపా, అంగన్వాడీ టీచర్లు పరిమళ, మంజుల, రంగమ్మ, లక్ష్మి, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

**విశాలాంధ్ర– గూడూరు:** మహిళల సాధికారతతోనే సమాజాభివృద్ధి చెందుతుందని జ్యోతి హై స్కూల్ చైర్మన్, మాజీ జెడ్పిటిసి ఎల్ వెంకటేశ్వర్లు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా శనివారం స్థానిక జ్యోతి హై హైస్కూల్లో మహిళా ఉపాధ్యాయుల ఆధ్వ ర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం కార్య క్రమానికి ఎల్ వెంకటేశ్వర్లతో జ్యోతి స్కూల్ కరస్పాండెంట్ జిలాని భాష, ఫౌండర్ టీచర్ యం రమేష్ హాజరై మహిళతో కేక్ కట్ చేయించి వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎల్.వెంక టేశ్వర్లు మాట్లాడుతూ పురుషులతో సమానంగా మహిళలకు సమాన హక్కులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీచర్లు విశ్వనాథ్, రామలక్ష్మి, లక్ష్మీ, పుష్ప, లలిత, సుబ్బు, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

**విశాలాంధ్ర – కర్నూలు వైద్యశాల:** జి.పుల్లారెడ్డి దంత వైద్య కళాశాలలో శనివారం మధ్యాహ్నం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా శ్రీ గురు సాయి దత్త పాలి క్లినిక్ అధినేత మరియు సీనియర్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ శర్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల పోరాటాలు, సాధికారత గురించి ప్రస్తావిస్తూ సమాజంలో మహిళలకు ఉన్న ప్రాముఖ్యత గురించి వివరించారు. నేటి మహిళలు ప్రతి రంగంలోనూ అందరికీ ప్రేరణ కలిగించే విధంగా ముందున్నారని నాయకత్వ లక్షణాలు ప్రస్ఫుటంగా కనబడుతున్నాయని, వారి పాత్ర సమాజానికి ఎంతో అవసరం ఉందని ఆయన అన్నారు. వైద్య, విద్య పరిశోధన తదితరు రంగాల్లో అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లడంలో మహిళల పాత్ర చాలా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మురళీధర్ రెడ్డి, డాక్టర్ భారతి, డాక్టర్ నేహా, ఇతర విభాగాధిపతులు, వైద్యులు, ఆస్పత్రి సిబ్బంది తరులు పాల్గొన్నారు.